క్లుప్తంగా

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న విజయలక్ష్మి

పెద్దకడబూరు : మండలంలోని దొడ్డిమేకల గ్రామానికి చెందిన ఈడిగ లక్ష్మి కొంతకాలంగా డయాలసిస్‌తో బాధపడుతూ కర్నూల్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీరు విజయలక్ష్మి చంటి బిడ్డను ఎత్తుకొని కర్నూల్‌కు వెళ్లి ఈడిగ లక్ష్మికి పింఛన్ అందజేసింది.

పూడికతీత పనుల పరిశీలన

ఆదోని టౌన్ : పట్టణంలోని మేదర్‌గేరి, విక్టోరియాపేటలో మురుగు కాలువలు పూడికతో నిండిపోయి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి శానిటరీ సెక్షన్ అధికారులు, సిబ్బందితో కలిసి ఆదివారం పూడికతీత పనులను చేపట్టారు. పూడికను ఎత్తివేసి కాలువలను శుభ్రం చేశారు. ఏరోజుకారోజు ఏ వార్డుల పరిధిలో సంబంధిత శానిటరీ సెక్షన్ అధికారులు, వర్కర్లు పూడికతీత పనులను చేపట్టి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ సూచించారు. శానిటరీ సెక్షన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, మేస్త్రీలు ఉన్నారు.

నివాళి



రామ్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : స్థానిక ఆర్టీసీ డిపోలో ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజీవ్‌రత్న అవార్డు గ్రహీత రామ్మోహన్ వర్ధంతిని యూనియన్ నాయకులు ఆదివారం నిర్వహించారు. ముందుగా ఎన్‌ఎంయూఏ అసోసియేషన్ సలహాదారుడు లక్ష్మన్న, డిపో కార్యదర్శి హరిబాబు, గ్యారేజ్ కార్యదర్శి షరీఫ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామ్మోహన్‌రావు కార్మికులకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఖాదర్‌లింగస్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి



దర్గాలో జిల్లా జడ్జి పి.జె.సుధ

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాను ఆదివారం జిల్లా జడ్జి పి.జె.సుధ దర్శించుకున్నారు. ఈమెకు దర్గా ధర్మకర్త మున్నా పాషా చిష్టి స్వాగతం పలికి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. అనంతరం జడ్జిని సత్కరించారు. దర్గా అభివృద్ధి, చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. దర్గాలో హిందూ ముస్లింలు అనే బేధ భావన లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండటం అద్భుతమన్నారు. సేవల్ని ఇలాగే కొనసాగించాలని ధర్మకర్తను కోరారు. అనంతరం ఆమె ఉరుకుందలో వెలసిన ఈరన్నస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.

15న కౌలు రైతుల జిల్లా సదస్సు



మాట్లాడుతున్న తిమ్మయ్య

ఎమ్మిగనూరుటౌన్: కౌలు రైతుల జిల్లా సదస్సు ఈనెల 15వ తేదీన ఆస్పరిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 50 వేల మంది కౌలు రైతులు ఉన్నారని, గత్యంతరం లేని స్థితిలో పంటలు సాగుచేస్తున్నారన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేకపోవడంతో కౌలు రైతులు ఏటా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కౌలు రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, రైతు భరోసా తదితర పథకాలు వర్తింప జేయాలన్నారు. కౌలు రైతుల సదస్సుకు రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షులు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్యలు హాజరుకానున్నారని తెలిపారు. రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పంపణ్ణగౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సీపీఐ ప్రజాసంఘాల నాయకులు భాస్కర్‌యాదవ్, జబ్బార్, చిన్నన్న, బాలరాజు, బజారి, శాంతప్ప, తిమ్మగురుడు పాల్గొన్నారు.

13న టెంకాయల వేలం

ఆస్పరి: కైరుప్పల గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా నిర్వహించే వీరభద్ర స్వామి ఉత్సవాల సందర్భంగా టెంకాయలను విక్రయించుకునే హక్కుల కోసం ఈ నెల 13వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

ఇప్పటికి ఎనిమిదేళ్లు..
ఎన్నికలకు ఇంకెన్నేళ్లు!

రాజకీయ చట్రంలో 'పెద్ద మసీదు'
- ఎన్నికలకు పూర్వ ముతవల్లీలు అడ్డు
- అమలుకు నోచుకోని కోర్టు ఆదేశాలు
- మీనమేషాలు లెక్కిస్తున్న వక్ఫ్‌బోర్డు
- నిధులు పక్కదారిపడుతున్నాయనే ఆరోపణలు

ప్రసిద్ధ షాహీ జామియా మసీదు ప్రతిష్టకు భంగం కలుగుతోంది. క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించి.. ఏళ్లనాటి వైభవాన్ని చాటిచెప్పాల్సిన మసీదు కమిటీ సొంత ఎజెండాతో ముందుకు సాగుతోంది. నిస్వార్థ సేవను పక్కనపెట్టి.. రాజకీయాలకు చోటు కల్పించడంతో నిధుల గోల్‌మాల్ చోటు చేసుకుంటోంది. మసీదు ఖాతాలో చేరాల్సిన ఆదాయం కాస్తా.. నిర్వాహకుల జేబుల్లోకి వెళ్తోంది. ఇదే సమయంలో మసీదు దుకాణాలనే నమ్ముకుని వ్యాపారాలు సాగిస్తున్న యజమానులను అనధికార కమిటీ గందరగోళానికి గురిచేస్తోంది. ఇకనైనా అవాంతరాలను సమష్టి నిర్ణయంతో అధిగమించి ఎన్నికలకు మార్గం సుగమమం చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆదోని రూరల్: పట్టణంలోని షాహీ జామియా మసీదు(పెద్ద మసీదు) దక్షిణ భారతదేశంలోనే పేరు కలిగిన మసీదుల్లో ఒకటి. ఈ మసీదును సిద్దిసూ ద్ఖాన్ నిర్మించాడు. 1921 మార్చి 21న మొట్టమొదటిసారిగా మసీదుకు ఎన్నికలు నిర్వహించారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2014లో డబ్ల్యూపీ నంబర్ 336/214 ద్వారా హైకోర్టు వక్ఫ్‌బోర్డుకు షాహీజామియా మసీదుకు ఎన్నికలు జరపాలంటూ ఆదేశాలు జారీ చేసింది. 2015 మే 3వ తేదీన వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో మసీదుకు ఎన్నికలు జరిగాయి. మే 4వ తేదీన ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో గుజిరిరావూఫ్, షాషావలి, సయ్యద్‌జాహిద్‌అన్వర్, కల్లూల్ రహంతుల్లా, మస్తాన్‌వలీలు



ఆదోనిలోని జామియా మసీదు

ముతవల్లీలుగా గెలుపొందారు. అయితే ఈ ఎన్నికలు ఆదోని షాహిజామియా మసీదు బైలా ప్రకారం కోర్టు నిర్ణయించిన మేరకు జరగలేదంటూ పూర్వ ముతవల్లీలు కె.ఎజాజ్‌అహ్మద్, ఆర్.సల్లావుద్దీన్‌లు కోర్టుకెక్కారు. కేసును విచారించిన ధర్మాసనం ఎన్నికలు బైలా ప్రకారం జరగకపోవడంతో మళ్లీ నిర్వహించాలని వక్ఫ్‌బోర్డును ఆదేశించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అప్పటి ట్రస్టీ కల్లూల్ రహంతుల్లా మరో కేసు దాఖలు చేశారు. దీనిని కూడా విచారించిన ధర్మాసనం కేసును కొట్టేస్తూ వక్ఫ్‌బోర్డు లా ఆఫీసర్ పర్యవేక్షణలో ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇప్పటికి ఐదేళ్లు దాటినా ఎన్నికల ఊసే లేకపోవడం గమనార్హం.

లెక్కలు చెప్పాల్సి వస్తుందని..

గతంలో జరిగిన ఎన్నికల్లో ఐదుగురు ముతవల్లీల్లో ముగ్గురు చనిపోగా.. ప్రస్తుతం ఉన్న ఇద్దరిలో టీడీపీ మద్దతు ముతవల్లీ గుజిరి రావూఫ్ వక్ఫ్‌బోర్డు అధికారులతో కుమ్మక్కు అయ్యారనే చర్చ జరుగుతోంది. మసీదుకు ప్రతినెలా దాదాపు రూ.3లక్షల ఆదాయానికి లెక్కలు చూపాల్సి వస్తుందనే ఎన్నికలకు అడ్డు పడుతున్నారని సమాచారం. వాస్తవానికి మసీదుకు వచ్చే ఆదాయాన్ని సంబంధిత ఖాతాలో జమ చేయాల్సి ఉంది. అయితే గత ఎనిమిదేళ్లుగా మసీదు ఖాతాలో ఎలాంటి నిధులు జమ చేయడం లేదని తెలుస్తోంది.

ముందుగా ఎన్నికలు నిర్వహించాలి



షాహీజామియా మసీదుకు చెందిన దుకాణాన్ని కొన్నేళ్లుగా బాడుగకు నిర్వహిస్తున్నా. ప్రస్తుత ముతవల్లీల పదవీకాలం ఎప్పుడో ముగిసింది. మసీదు కమిటీ బైలా ప్రకారం ఏమి చేయాలన్నా ఐదుగురు ముతవల్లీలు మెజారిటీ నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే అది చెల్లుబాటు అవుతుంది. రద్దయిన పాలకవర్గం 33 శాతం బాడుగలను పెంచుతామని ప్రకటించారు. ఇది ఎంతమాత్రం సమంజసం. ముందుగా ఎన్నికలు నిర్వహించిన తర్వాతే ఎలాంటి నిర్ణయమైనా తీసుకోవాలి. – దార్వాడ్ రసూల్‌సాబ్, దుకాణదారు

మసీదు పరిధిలోని మొత్తం దుకాణాలు: 200	
ప్రతినెలా బాడుగలు:	రూ.3లక్షలు
ప్రతినెలా వ్యయం:	రూ.2.50 లక్షలు
ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన సభ్యులు: 6,413	

అనధికార పెత్తనం



2015లో బైలా ప్రకారం ఎన్నికలు నిర్వహించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాం. కోర్టు ఆ ఎన్నికను రద్దు చేసింది. అప్పటి నుంచి ఎన్నికల నిర్వహణ విషయంలో వక్ఫ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడున్న ముతవల్లీల్లో ముగ్గురు చనిపోగా, మిగిలిన ఇద్దరు అనధికారికంగా పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రతినెలా మసీదుకు సమకూరుతున్న ఆదాయాన్ని కూడా ఇళ్లకు తీసుకెళ్తున్నారు.
– కె.ఎం.జుబేర్ అహ్మద్, మాజీ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ

స్టే రద్దయినట్లు తెలిసింది



ఎన్నికల నిర్వహణ విషయమై హైకోర్టు విధించిన స్టే రద్దయినట్లు తెలిసింది. కరోనా కారణంగా గత రెండేళ్లలో ఈ విషయంపై దృష్టి సారించలేదు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడతాం.
– అబ్దుల్‌కదీర్‌సాబ్, ఏపీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలి

- ఘనంగా శ్రీ ఆదిజగద్గురు రేణుకాచార్యుల జయంత్యుత్సవం



ఆధ్యాత్మిక ప్రవచనాలను వినిపిస్తున్న పీఠాధిపతులు



ఊరేగింపులో కళశాలతో బాలికలు



అయ్యాచారం తీసుకున్న దృశ్యం

ఆదోని అర్బన్ : ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరిస్తే ఎలాంటి ప్రళయాలు, ఘర్షణలు, అరాచకాలు, కరువు కాటకాలు ఉండవని, వర్షాలు బాగా కురవడమేగాకుండా వాతావరణంతో పాటూ అన్నీ అనుకూలిస్తాయని పీఠాధిపతులు పాల్తూరు కల్లుహోళిమఠం చెన్నవీరశివాచార్య మహాస్వాములు, జంగమరహోసల్లి పురవర్గమఠం అజాత శంభులింగశివాచార్య, రౌడుకుంది హిరేమఠం శివయోగిశివాచార్య, ఆదోని కల్లుమఠం గురుసిద్ధమహాస్వాములు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీపేట వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో డివిజన్ జంగమ సమాజ సేవాసంఘం ఆధ్వర్యంలో శ్రీఆది జగద్గురు రేణుకాచార్యుల జయంత్యుత్సవం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి శ్రీపేట వీరభద్రేశ్వరస్వామి రేణుకాచార్యుల మూర్తులకు రుద్రాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జంగమ మహేశ్వరులకు అయ్యాచార (గురుబోధన) కార్యక్రమాన్ని పీఠాధిపతులు చేయించారు. భక్తులకు ఆధ్యాత్మిక విషయాలను తెలియజేశారు. ధర్మాన్ని ఆచరించిన వారు దేవుడితో సమానమన్నారు. మన దేశం సనాతన ధర్మంతో కూడినదని, కొన్ని దేశాలు మన ధర్మ, సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తున్నారన్నారు. పిల్లలకు చిన్నవయస్సులోనే న్యాయం, ధర్మం గురించి తెలియజేసి ప్రతిరోజూ భగవంతుడిపై భక్తి పెంచేలా చూడాలని కోరారు. సాయంత్రం శ్రీరేణుకాచార్యుల ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో కుంభం, కలశం, డోలులు, భాజా భజంత్రీలు, నందికోలు, వీరగాసే, కోలాట, నృత్యాలు చేపట్టారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు గురునాథయ్య, మహర్షి విజయ్‌కుమార్, సభ్యులు చంద్రయ్య, ఎండి. బసవరాజుస్వామి, వీరేష్, మల్లికార్జున, మణికంఠ, మంజు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.



మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

క్రీడాకారులకు అభినందన

ఆదోని అర్బన్ : గతనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ముందుగా అసోసియేషన్ అధ్యక్షుడు రాచోటి సుధాకర్, సభ్యులు చంద్రకాంత్‌రెడ్డి, బద్రినాథ్, నాగరాజ్, దేవిశెట్టి ప్రకాష్ పతకాలు సాధించిన వారిని అభినందించారు. అధ్యక్షుడు మాట్లాడుతూ కురుక్షేత్రం, కలకత్తాలో గత నెలలో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆదోని నుంచి 9 మంది పాల్గొనగా లక్ష్మి, లూర్ధమ్మ, ఖాజా బందేనవాజ్, సీమ, నాగరాజ్ పతకాలు సాధించారని వివరించారు.

టీడీపీకి ఓటేస్తే కరువు తప్పదు



వాల్మీకి నగర్‌లో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిటౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తే కరువు తప్పదని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత విమర్శించారు. ఆదివారం పట్టణంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తరపున ప్రచారం చేశారు. 1, 4వ వార్డులోని పట్టభద్రులను కలిసి వెన్నపూస రవీంద్రారెడ్డికే ఓటు వేయాలని అభ్యర్థించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన రవీంద్రారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని, తద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. గతంలో బాబు వస్తే జాబు వస్తుందని, నిరుద్యోగులను నట్టేట ముంచారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి జగనన్న 5.70 లక్షల ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, మహిళా నాయకురాళ్లు శ్రీలక్ష్మి, పర్వీన్‌బాను, వార్డు ఇన్‌చార్జ్ గోవింద్‌మాలిక్, ఎజాస్, నాయకులు తాయన్న, ఈరప్ప, సుధాకర్, బాబు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రా రెడ్డిని గెలిపించుకుందాం



పట్టభద్రులను కరపత్రం అందజేస్తున్న మురళీ మోహన్ రెడ్డి



ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నాయకులు

కోసిగి: ఈనెల 13వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన విద్యావంతుడైన వెన్నపూస రవీంద్రా రెడ్డిని గెలిపించుకుందామని పార్టీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చిన్నభూంపల్లి, దొడ్డి బెళగల్ గ్రామాల్లో పట్టుభద్రుల ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్ర రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మయ్య, ఉశేని, ఉప సర్పంచ్ నరసింహులు, రాజోలి లక్ష్మయ్య, అంజినేయ, రాగప్ప, మల్లికార్జున రెడ్డి, ప్రశాంతి రెడ్డి, సూర్యకాంత్ రెడ్డి, శివరామిరెడ్డి, వరి నరసప్ప, ఈరన్న, బజారి, మాల నరసింహులు,మహానంది, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : శాసన మండలి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని గంగులపాడు, రాగిమాన్‌దొడ్డి, హనుమాపురం, దొడ్డిమేకల, హెచ్.మురవణి, జాలవాడి, కంబలదిన్నె గ్రామాల్లో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. మాజీ ఎంపీపీ రఘురాముడు, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, నాయకులు రవిచంద్రారెడ్డి, గజేంద్రరెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి పూజారి ఈరన్న, దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, అర్లప్ప, దేవదానం పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూసరవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నేతలు జి.భీమిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని వగరూరు, వి.తిమ్మాపురం, బూదూరు, సూగూరు, చెట్నేహళ్లి గ్రామాల్లో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి రవీంద్రారెడ్డికే ఓటు వేయాలని అభ్యర్థించారు.

కౌతాళం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేయాలని ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, ఎంపీటీసీ లింగన్నగౌడ్, ఏకాంబర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని నదిచాగి, కుంబళనూరు, కుంబళనూరు క్యాంపు-1, క్యాంపు-2, మరళి, మేళిగనూరు గ్రామాల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. ముందుగా మేళిగనూరులో రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి ప్రచారం ప్రారంభించారు. హాల్వి బసవరాజు, మరేగౌడ్, బొగ్గుర్‌గౌడ, మాజీ ఎంపీటీసీ ఈశప్పగౌడ్, అనిల్, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

మంత్రాలయం రూరల్: మండలంలోని చెట్నేహళ్లి గ్రామానికి చెందిన భీమన్న అనే వ్యక్తి తుంగభద్ర నదిలో 24 మద్యం ప్యాకెట్లు 90ఎంఎల్ తీసుకొస్తుండగా సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు మంత్రాలయం పోలీసులు తెలిపారు.

బాలికలు స్వయంశక్తితో ఎదగాలి

ఆలూరు: నిరంతరం తరగనిది విద్య మాత్రమేనని కమ్మరచేడు గ్రామ సాయిబాబా మందిరం నిర్వాహకులు, ఆనంద నిలయం సేవాసమితి ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీకంఠమూర్తి అన్నారు. గ్రామంలో బాలికలకు ఉచితంగా మూడు నెలల పాటు కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆలయంలో ఆదివారం శిక్షణ బ్యాచ్ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలికలు స్వయం శక్తితో ఎదగాలన్నారు. నేడు ఫ్యాషన్ డిజైనింగ్ వల్ల ఎంతో మంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారని వివరించారు. ఆలయకమిటీ పెద్దలు మల్లికార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కుట్టు శిక్షణ మాస్టారుకు బాలికలు జ్ఞాపికను అందజేసి ప్రత్యేకంగా సన్మానించారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టు క్షేత్రంలో వెలసిన మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని విరాట్ మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలో రుద్రాభిషేకంతో పాటు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, భండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాళ మల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. కొందరు భక్తులు మోకాళ్లతో మెట్లను ఎక్కుతూ వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.భక్తులకు ఆలయంలో పూజారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మార్కెట్‌కు పోటెత్తిన వేరుశనగ

ఎమ్మిగనూరు: స్థానిక మార్కెట్ యార్డు ఆదివారం పంట ఉత్పత్తులతో కళకళలాడింది. ఒక్కరోజే 508 మంది రైతులు 4,803 క్వింటాళ్ల వివిధ రకాల దిగుబడులను తెచ్చారు. అందులో వేరుశనగ దిగుబడులు 4,626 క్వింటాళ్లు ఉండటం విశేషం. వేరుశనగ క్వింటాల్ గరిష్ఠ ధర రూ.7,560, కందులు రూ.7,450, ఆముదాలు రూ.6,290, మొక్కజొన్న రూ.2,042, శనగలు రూ.4,500లకు అమ్ముడుపోయినట్లు యార్డు కార్యదర్శి ఉమాపతి రెడ్డి తెలిపారు.

వేసవి తాపం తీర్చుకునేందుకు..

కోసిగి: వేసవి ప్రారంభం కావడంతో భానుడి ప్రభావం రోజు రోజు పెరిగిపోతోంది. ఎండలు మండుతుండటంతో ప్రజలు చల్లని పానీయాలు, పుచ్చకాయల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో అనుమంతు అనే రైతు పుచ్చకాయలు వ్యాపారం ప్రారంభించాడు. పుచ్చకాయలను కౌతాళం మండలం హాల్వి, కోడుమూరు, ఆదోని డివిజన్‌లోని పొలాల నుంచి కొనుగోలు చేస్తున్నాని చెప్పాడు. ఒక్కో పుచ్చకాయ రూ.50 నుంచి రూ.80 వరకు ధర పలుకుతోంది.



పుచ్చకాయలను విక్రయిస్తున్న రైతు అనుమంతు



నిల్వ ఉంచిన పుచ్చకాయలు